క్లుప్తంగా

సర్వేలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్

కూడేరు: ప్రభుత్వం చేపడుతున్న సర్వేలను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ తిప్పే నాయక్ ఆదేశించారు. బుధవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వేల పురోగతిపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్క్ ఫ్రం హోమ్, సిటిజన్ ఈ-కేవైసీ, చిల్డ్రన్ విత్ అవుట్ ఆధార్‌తో పాటు ఇతర సర్వేలపై అలసత్వం వహించొద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని సకాలంలో సర్వేలు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల చోరీ

కుందుర్పి: మండలంలోని కరిగానిపల్లి, జంబుగుంపల గ్రామాల్లో మంగళవారం రాత్రి రైతులు హరికృష్ణ,రాంబాబుకు చెందిన డ్రిప్ పరికరాలు, విద్యుత్ స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. ఈమేరకు బుధవారం బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఉగాది సందర్భంగా గ్రామాల్లో 3 రోజులుగా జూదాలు ఎక్కువ కావడంతో జూదరులు డబ్బు కోసం చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

హార్టికల్చర్ సదస్సు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

రాయదుర్గంటౌన్: అనంతపురంలో ఈ నెల 8న నిర్వహించే హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యాన రైతుల సమస్యలను చర్చించేందుకు అన్ని జిల్లాల నుంచి రైతులు సదస్సుకు హాజరవుతారన్నారు. సమస్యల పరిష్కారం దిశగా సదస్సులో తీర్మానించే అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, దుర్గన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొ్ట్రేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీజీఎం ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శైలజరాణి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజరాణి

కళ్యాణదుర్గం: ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శైలజరాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ జయరామిరెడ్డి పదవీ విరమణ చేపట్టడంతో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ టి.శైలజరాణికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది నూతన ప్రిన్సిపల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో అకడమిక్, నాన్ అకడమిక్ అంశాలను దృష్టిలో ఉంచుకుని కళాశాల అభివృద్ధికి, విద్యార్థులు అభ్యున్నతికి పాటుపడుతామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, అధ్యాపకులు శేషయ్య, శ్యాం ప్రసాద్, జ్యోత్స్న, సూర్యనాగిరెడ్డి, కవిత, ప్రభావతి, చాముండేశ్వరమ్మ, రాధాకృష్ణ, అధ్యాపకేతర సిబ్బంది మహమ్మద్ అలీ, రామకృష్ణ, ఓబేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం



మొక్కజొన్న కోత యంత్రంపై కూర్చున్న కూలీలు

బొమ్మనహాళ్: వ్యవసాయ కూలీలు మొక్కజొన్న, వేరుశనగ యంత్రాలపై కూర్చొని ప్రమాదకర రీతిలో ప్రయాణం సాగిస్తున్నారు. మండలంలోని ఉంతకల్లు, దేవగిరి, దర్గాహొన్నూరు, గోవిందవాడ, తారకాపురం తదితర గ్రామాల్లో బోర్లు, ఆయకట్టు కింద సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ కోతలు కోస్తున్నారు. పొలాల్లో పనులకు వెళ్లిన కూలీలు యంత్రాలపైనే కూర్చొని ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం పట్టు జారినా కింద పడి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది.

అధ్వానంగా.. డివైడర్లు



డివైడర్‌పై పెరిగిన కంప చెట్లు



లక్ష్మీబజార్ సర్కిల్‌లో ఇలా ...

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారిలో డివైడర్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. డివైడర్లు శిథిలదశకు చేరుకుని కళావిహీనంగా మారాయి. లక్ష్మీబజార్ నుంచి పాత బస్టాండ్, వినాయక సర్కిల్ మీదుగా మొలకాల్మూరు రోడ్డు తేరు బజారు వరకు డివైడర్లు ఉన్నాయి. పదేళ్ల క్రితం దాదాపు నాలుగు అడుగుల మేర వెడల్పుతో డివైడర్లు ఏర్పాటు చేశారు. వాటి మధ్యలో అడవిచెట్లు పెంచుతున్నారు. ఆ చెట్లు ఏపుగా పెరిగి దుమ్ముపట్టి ఉన్నాయి. అంతేకాదు ఆ చెట్ల పక్కనే కంప చెట్లు పెరిగాయి. ఇవి వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. లక్ష్మీబజార్‌లో మూడు చోట్ల వర్షపు నీరు బయటకు వెళ్లేందుకని డివైడర్లను పగులగొట్టారు. అన్ని చోట్ల కార్నర్‌లు దెబ్బతిన్నాయి. డివైడర్ల వెడల్పు తగ్గించి అందమైన చెట్లను పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డివైడర్ మధ్యలో చెట్లు, మట్టి మొత్తం తొలగించి సుందరీకరణ చేపడుతామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యలపై ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రెండు రోజుల నిరసన కార్యక్రమంలో తొలిరోజు బుధవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించారు. రాయదుర్గం డిపోలో ఎస్‌ఎంయూఏ డిపో కార్యదర్శి తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల మొదటి డ్యూటీ నుంచి ఉద్యోగులందరూ ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేశారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఉద్యోగులు ఇచ్చిన సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. 1/2029 సర్కులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలని, ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు జీఓ మేరకు పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు సంబంధించి పూర్తి జీతం ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, రమేష్, నఫీస్, గోపికృష్ణ, బాలాజీనాయక్, నారాయణ, బీపీ రెడ్డి, రాఘవ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ వసంతబాబు

బెళుగుప్ప: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జరుగుతున్న వివిధ సర్వేలను వేగవంతం చేయాలని ఆర్‌డీఓ వసంతబాబు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. పీ-4 సర్వేలో మండల నమోదు శాతం చాలా తక్కువగా ఉందన్నారు. చిన్న పిల్లల ఆధార్ అప్‌డేట్, రేషన్ వినియోగదారులకు సంబంధించి వేలిముద్రల నమోదు, హౌస్‌హోల్డ్‌లో మిస్సింగ్ అయిన ఉద్యోగుల నమోదు, నాన్‌రెసిడెంట్ ఏపీ నమోదు, సిటిజన్స్ ఈ-కేవైసీ తదితర అంశాలకు సంబంధించిన సర్వేలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. త్వరలోనే నూతన పీహెచ్‌సీ భవనాన్ని అన్ని పనులు పూర్తి చేసి, ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాత పీహెచ్‌సీ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం తరలింపు ప్రక్రియను చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిళ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి



సీఐ రాజుతో మాట్లాడుతున్న ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నేతలు

కూడేరు: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గం చూపి, న్యాయం చేయాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే ఆంజనేయులు కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజును కలసి వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని జల్లిపల్లి , కరుట్లపల్లి, కడదరకుంట గ్రామాల్లో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ సంఘం నేతలు సీఐకు వివరించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా న్యాయ సలహాదారుడు ఆనంద్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, మండల దివ్యాంగులు ముత్యాలు, దండోరా నేతలు లక్ష్మన్న సుధాకర్, సురేష్, కుమార్ స్వామి పాల్గొన్నారు.

రేషన్ అడిగినందుకు దాడికి యత్నం

- టీడీపీ నేత నిర్వాకం



వడ్డే కాలనీలో రేషన్ దుకాణం వద్ద గుమిగూడిన ప్రజలు

కళ్యాణదుర్గం: ప్రభుత్వం ప్రతి నెలా రేషన్ దుకాణాల ద్వారా అందించే నిత్యావసర సరుకులను అడిగినందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై డీలర్, టీడీపీ నేత దాడికి యత్నించాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం కళ్యాణదుర్గం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని వడ్డే కాలనీలో 70వ రేషన్ దుకాణం వద్దకు బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహేష్ తల్లి వరలక్ష్మి రేషన్ బియ్యం కోసం వెళ్లింది. తమకు రేషన్ బియ్యం వేయాలని దుకాణంలో ఉన్న డీలర్, టీడీపీ నేత కెంచానపల్లి గోవిందును కోరింది. ఇందుకు గోవిందు 'మీరు అడిగినప్పుడు రేషన్ బియ్యం వేయాలా...మాకు ఇష్టమొచ్చినప్పుడు వేస్తాం' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో వెంటనే వరలక్ష్మి ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన కుమారుడు మహేష్‌కు తెలిపింది. మహేష్, తల్లితో పాటు నేరుగా రేషన్ దుకాణం వద్దకు వచ్చి డీలర్ నిర్లక్ష్యంపై నిలదీశారు. దీంతో కొద్దిసేపు రేషన్ దుకాణం వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసేందుకు దూకుడుగా రావడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి కొద్దిసేపు తోపులాట జరిగింది. స్థానికులు గుమిగూడటంతో పోలీసులు రంగప్రవేశం చేసి వివాదాన్ని సద్దుమణిగించారు. అయితే ప్రతి నెలా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పేదలకు ఇవ్వకుండా డీలరు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి ప్రతి నెలా సక్రమంగా బియ్యం వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీఎం దేవానంద ఫిలిప్స్‌న్

కూడేరు: డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం దేవానంద ఫిలిప్స్‌న్ సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో చిన్న సంఘాల సభ్యులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 'జీవనోపాధులు-అప్పులు' ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలంటే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని తెలియజేశారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ భారం తగ్గుతుందన్నారు. తీసుకున్న రుణాలను అనవసరమైన వాటికి ఖర్చు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సీసీలు రమణ, రామాంజనేయులు, మారెప్ప, మల్లికార్జున, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన సంచార పశు ఆరోగ్య సేవలు



పశు వైద్యశాల ఆవరణలో నిలిపేసిన వాహనం

కూడేరు: సంచార పశు ఆరోగ్య వాహన సేవలు సుమారు నెలన్నర రోజులుగా నిలిచిపోయాయి. కూడేరులోని పశువైద్య శాల ఆవరణలో ఓ మూలన సంచార ఆరోగ్య వాహనాన్ని నిలిపి వేశారు. మండల వ్యాప్తంగా ఆవులు, గేదెలు, ఎద్దులు సుమారు 17,500, గొర్రెలు, మేకలు సుమారు 1,10,000 వరకూ ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు అత్యవసర పరిస్థితిల్లో కూడా మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య వాహనాలను నియోజక వర్గానికి రెండు చెప్పున ఏర్పాటు కేటాయించింది. 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. పశుపోషకులు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే సంచార వాహనం వెళ్లి ప్రాథమికంగా వైద్య సేవలందించేవారు. మూగజీవాల ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉంటే మండల వైద్యాధికారి సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి అక్కడ నిపుణులుచే వైద్య సేవలందించేవారు. ఏజెన్సీ నిర్వాహకులే సిబ్బందికి జీతాలు, మందులు అందజేశారు. ఆ ఏజెన్సీ నిర్వాహణ గడువు ముగిసింది. కూటమి ప్రభుత్వం కొత్తగా ఏజెన్సీలకు వాహన నిర్వాహణ అప్పగించేందుకు ఒప్పందం ఇంకా కుదుర్చుకోలేదు. దీంతో ఒక పక్క సిబ్బంది ఉపాధిని కోల్పోయారు. మరో పక్క మూగజీవాలకు అత్యవసర వైద్య సేవలు అందక పశుపోషకులు అవస్థలు పడుతున్నారు.

చెత్త తొలగించింది..



నాడు: టీచర్స్ కాలనీలోని చెత్త కుప్ప



నేడు: శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిన దృశ్యం





నాడు: చంద్రబాబు కాలనీలోని బాలికల వసతి గృహం వద్ద.. నేడు: చెత్త తరలింపు తర్వాత..

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: పట్టణంలో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించారు. కొన్ని కాలనీల్లో గుట్టల్లా పేరుకుపోయిన చెత్తపై 'ఎక్కడి చెత్త అక్కడే' అనే శీర్షిక సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. టీచర్స్ కాలనీ వైపు వెళ్లే దారి, చంద్రబాబు కాలనీలోని బాలికల వసతి గృహం ముందు, రైల్వే అండర్ పాస్ కింద గత కొన్ని నెలలుగా తడి, పొడి, ప్లాస్టిక్ చెత్త గుట్టలుగా పేరుకుపోయాయి. చెత్త నిల్వలు ఉన్న చోట తొలగించి.. బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మెట్టు విశ్వ జన్మదినం



మెట్టు విశ్వకు కేక్ తినిపిస్తున్న అభిమానులు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం రాయదుర్గంలో ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున విశ్వ నివాసానికి చేరుకుని నోట్‌పుస్తకాలు, పూలు, బొకేలు, స్వీట్లు, పండ్లు అందిస్తూ, శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. మెట్టు విశ్వ మాట్లాడుతూ తమ కుటుంబంపై ప్రజలు పెంచుకున్న ఆదరాభిమానం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, అర్బన్, ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గౌని లక్ష్మీకాంతారెడ్డి, రాయంపల్లి రామాంజినేయులు, బ్రహ్మానందరెడ్డి, రవీంద్రరెడ్డి, వాల్మీకి రామాంజినేయులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివా, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి భోజరాజ్‌నాయక్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు, ఆయా మండలాల ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి



వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. వారు బుధవారం రాయదుర్గంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం జోహర్ నమాజ్ అనంతరం వివిధ మసీదుల నుంచి ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో జామియా చౌక్ మసీదు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి శాంతి ర్యాలీ చేపట్టారు. బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీబజార్ సర్కిల్, అనంతపురం రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఖాజీ సైఫుల్లా, న్యాయవాది వహాబ్, హబీబుర్ రెహమాన్ తదితరులు మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, ఖన్కాలు, శ్మశాన వాటికలు, ధార్మిక సంస్థలను లాక్కునేందుకు ఉద్దేశించిన కపటకుట్రగా అభివర్ణించారు. ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని కేంద్రం అడుగులు వేయడం మానుకోవాలని హితవు పలికారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు స్థానం కల్పించాలనే కుట్రతోనే బిల్లుకు కేంద్రం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అబ్దుల్ మజీద్, అంజుమన్‌కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, కౌన్సిలర్ ఫక్ృద్దీన్, ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ నిర్వాహులు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.

అక్కమాంబ హుండీ కానుకల లెక్కింపు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన అక్కమాంబ ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. జాతర ద్వారా మొత్తం రూ.3,35,000 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఒంటిమిద్ది, కురాకులతోట, దేవాదులకొండ గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



సోమిరెడ్డి (ఫైల్)

బొమ్మనహాళ్: శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సోమిరెడ్డి (75) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామాంజినేయులు, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, కోటేశ్వరరెడ్డి, కొత్తూరు తిమ్మప్ప, వెంకటేశులు, హనుమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. సోమిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

కుందుర్పి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సెకెండియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలని ఆయన కోరారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా గ్రామ దేవత ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుమ్మఘట్ట: రంగచేడు గ్రామంలో వెలసిన మారెమ్మ దేవత ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, తమలపాకుల పూజ, పుష్పాలంకరణ తదితర పూజలు చేశారు. తెల్లవారు జామున అమ్మవారికి దున్నపోతును బలిచ్చారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు.

తెరుచుకున్న ప్రమాదం!



మ్యాన్‌హోల్‌కు మూత లేక ప్రమాదకరంగా దర్శనమిస్తున్న కల్వర్టు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 16వ వార్డు మధు టాకీస్ వద్ద నుంచి పుట్టప్పతోటకు వెళ్లే దారిలో కల్వర్టుకు ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్ ప్రమాదకరంగా ఉంది. చాలా రోజుల నుంచి మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రపూట సమస్య మరింత అధికంగా ఉంటుందని కాలనీవాసులు తెలిపారు. గతంలో ఒక తెల్ల బండ ఉంచారని, ప్రస్తుతం ఎటువంటి మూతా లేక పోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్ హోల్‌కు చాంబర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రేపటి నుంచి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కుందుర్పి: మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ కూడలిలో ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్మీకి మండల సమితి బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. తొలిరోజు గణపతి పూజ, అఖండ దీపారాధన, 5న రక్షాబంధనం, కలశస్థాపన, ధ్వజారోహణం, 6న నవగ్రహ హోమం, విమాన గోపుర ప్రతిష్ఠ, వాల్మీకి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ తదితర పూజలుంటాయని పేర్కొంది.

పని ఒత్తిడి తగ్గించాలి

బెళుగుప్ప: సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులందరూ పంచాయతీ సెక్రటరీలపై వత్తిడి చేయడం సరికాదని ఏపీ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ అన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని బుధవారం ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓఆర్‌డీ నాగేశ్వరశాస్త్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జగదీష్, శ్రీరాములు, గోపాల్, శివరంజని, ఉమాదేవి, పాండు, అశోక్, ప్రవీణ్, శోభన్‌బాబు, రామ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హుండీ అపహరణ



ఆంజనేయస్వామి ఆలయం

రాయదుర్గంటౌన్: నాగిరెడ్డిపల్లిలో మంగళవారం అర్ధరాత్రి ఆంజనేయస్వామి ఆలయంలో దుండగులు చొరబడి హుండీని అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం భక్తులు హుండీ చోరీని గుర్తించారు. హుండీలో భక్తులు కానుకల రూపంలో వేసిన నగదు రూ.లక్ష దాకా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గతంలో కూడా ఈ ఆలయంలో హుండీలోని కానుకలు చోరీ అయ్యాయని, ఈసారి ఏకంగా హుండీనే ఎత్తుకుపోయారని చెప్పారు.